



నారాయణపేటలోని చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ

సర్వే సరే.. మంజూరెప్పుడో




డ్రై పోర్టు ఏర్పాటుకు అడ్డాకుల మండలం గుడిబండ వద్ద స్థల పరిశీలన చేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, సీఎంవో, పరిశ్రమల శాఖ అధికారులు

- ఉమ్మడి జిల్లాలో రెండు రైల్వే లైన్ల రేట్ ఆఫ్ రిటర్న్స్‌పై రైల్వేశాఖ తర్జనభర్జనలు
- ఇప్పటికే గద్వాల-డోర్నకల్, కృష్ణా-వికారాబాద్ ఫైనల్ లొకేషన్ సర్వే పూర్తి
- పాలమూరు ప్రజాప్రతినిధులు రెండు రైల్వేలైన్ల విషయంలో ఒత్తిడి తెస్తే మేలు
- రెండింటికీ రూ.7,500 కోట్లు వ్యయం అవుతుందని ప్రాథమిక అంచనాలు
- గూడ్స్ రైళ్లు ఎక్కువగా తిరిగే అవకాశం ఉంటేనే రేట్ ఆఫ్ రిటర్న్స్‌కు బ్రేక్ ఈవెన్
- దేవరకద్రలో డ్రైపోర్టు ఏర్పాటైతే మూడు రాష్ట్రాలకు రవాణా మార్గానికి అవకాశం

మహబూబ్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల చిరకాల కోరిక గద్వాల- డోర్నకల్, కృష్ణా- వికారాబాద్ రైల్వేలైన్లు. ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాకు ఒకటే రైలు మార్గం ఉండగా.. ప్రస్తుతం మహబూబ్‌నగర్ వరకు డబ్లింగ్ పూర్తయ్యింది. అక్కడి నుంచి డోన్ వరకు డబ్లింగ్ పనులు చేయడానికి కొన్ని నెలల క్రితం ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన కూడా చేశారు. అయితే తీవ్ర వెనుకబాటులో ఉన్న దక్షిణ తెలంగాణ ప్రాంతాన్ని నల్గొండ మీదుగా ఏపీలోని జిల్లాలతో కలపాలనే డిమాండ్ దాదాపు మూడు దశాబ్దాలుగా ఉంది. అలాగే కృష్ణా నుంచి వికారాబాద్ రైల్వేలైన్ కొడంగల్ మీదుగా వెళ్తే పారిశ్రామికంగా ఆ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు సుదూర ప్రాంతాలకు దూరభారం తగ్గుతుందనే అభిప్రాయం ఉంది. ఇప్పటికే ఈ రెండు రైల్వేలైన్లకు సంబంధించి ప్రభుత్వం ఫైనల్ లొకేషన్ సర్వేకు ఆదేశించి, పూర్తి చేసింది. గతంలో గద్వాల- మాచర్లగా ఉన్న లైన్ అలైన్‌మెంట్‌ను మార్చి.. దాన్ని గద్వాల-డోర్నకల్ మార్గం కోసం సర్వే పూర్తి చేశారు. దీనికి ప్రాథమిక అంచనాల మేరకు రూ.5,500 కోట్లు అవుతుందని రూపొందిస్తున్న డీపీఆర్ తుది దశలో ఉంది. అదే సమయంలో కృష్ణా- వికారాబాద్ రైల్వేలైన్‌కు కూడా 122 కిలో మీటర్ల దూరానికి రూ.2 వేల కోట్లు ఖర్చవుతుందని ఎఫ్ఎల్ఎస్ సందర్భంగా రైల్వేశాఖ అధికారులు నిర్ధారించారు. ఎఫ్ఎల్ఎస్ పూర్తయిన సందర్భంగా రైల్వే లైన్లు మంజూరవడమే తరువాయి అనే ప్రచారం గత సంవత్సరం నుంచీ జరుగుతోంది. కానీ బడ్జెట్‌లో మాత్రం చోటు లభించలేదు. ఏటా ఎప్పుడెప్పుడా అనే ఎదురుచూపులు ఉమ్మడి పాలమూరు ప్రజలకు తప్పడం లేదు. కేంద్రంపై రాజకీయ ఒత్తిడి తీసుకువస్తే వచ్చే బడ్జెట్‌లో రెండు రైల్వేలైన్లు మంజూరవుతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



రేట్ ఆఫ్ రిటర్న్స్ ఉంటేనే..

సాధారణంగా ప్యాసింజర్ రైళ్ల ద్వారా రైల్వేశాఖకు పెద్దగా ఆదాయం ఉండదు. పైగా నష్టం కూడా వస్తుంది. సరుకు రవాణా రైళ్ల ద్వారానే సింహభాగం ఆదాయాన్ని రైల్వేశాఖ ఏటా ఆర్జిస్తోంది. ఇప్పుడు ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఎఫ్ఎల్ఎస్ పూర్తి చేసుకున్న రెండు రైల్వేలైన్లకు కలిపి రూ.7,500 కోట్ల పైచిలుకు వ్యయం అవుతుందని అంచనాలు

(మిగతా 6లో..)

డ్రైపోర్టు ఏర్పాటుతో ఉపయోగాలు



దేశంలోనే అతిపెద్ద జాతీయ రహదారి ఉమ్మడి పాలమూరు జిల్లా గుండా సుమారు 200 కిలో మీటర్లు వెళ్తుంది. ఒక్క దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోనే 66 కిలో మీటర్లకుపైగా ఉంది. ఇక్కడ డ్రై పోర్టు ఏర్పాటు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలమందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే ఒక రైల్వేలైన్ అందుబాటులో ఉంది. అలాగే గద్వాల- డోర్నకల్ రైల్వేమార్గం మంజూరైతే మరింత కనెక్టివిటీ పెరుగుతుంది. అటు ఏపీ, తమిళనాడు పోర్టులతోపాటు ఇటు గోవా, కేరళ వరకు కూడా సరకు రవాణాకు సులభమవుతుంది. ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధి చెందడానికి అవకాశం ఉండటంతో త్వరితగతిన మంజూరుకు కృషి చేస్తాం.

\- జి.మధుసూధన్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే

కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్ల సర్వీసు రెన్యువల్

- ఉమ్మడి జిల్లాలో 396 మందికి అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన ఆర్థిక శాఖ
- వచ్చే ఏడాది మార్చి 31 వరకు అమలు

నారాయణపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల 396 కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్లను రెన్యువల్ చేస్తూ ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. అందులో కాంట్రాక్టు లెక్చరర్లు 92 మంది, గెస్టు లెక్చరర్లు 304 మంది, అవుట్ సోర్సింగ్ సిబ్బంది 63 మంది, టైస్కేల్ సిబ్బంది ఆరుగురు ఉన్నారు. ఈ మేరకు ఆర్థిక ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు ఇచ్చారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు ఈ ఉత్తర్వులు వర్తిస్తాయి.

నాలుగు డిగ్రీ కాలేజీలకు మంజూరు కాని పోస్టులు

ముఖ్యమంత్రి నియోజకవర్గ పరిధిలోని మద్దూర్, కోస్గి మహిళా ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు మంజూరై రెండేళ్లు గడుస్తున్నా.. బోధన, బోధ నేతర పోస్టులు మంజూరు కాలేదు. అదే విధంగా ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నారాయణపేట నియోజవర్గ పరిధిలో ధన్వాడకు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ మంజూరై మూడేళ్లు గడుస్తున్నా దానికీ పోస్టులు ఇవ్వలేదు. మంత్రి వాకిటి శ్రీహరి ప్రాతినిధ్యం వహిస్తున్న మక్తల్‌లో రెండేళ్లుగా కొనసాగుతున్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి సైతం కాంట్రాక్టు, గెస్ట్ లెక్చరర్ల పోస్టుల మంజూరుకు ఆర్థిక శాఖ అనుమతి లభించ లేదు.

సీఎం చొరవ తీసుకోవాలి

విద్యాపరంగా వెనుకబడిన నారాయణపేట జిల్లాపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని జిల్లాలోని నాలుగు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలకు బోధన, బోధనేతర పోస్టులు మంజూరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై తెలంగాణ డిగ్రీ లెక్చరర్ల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కిషోర్‌కుమార్, రాష్ట్ర నాయకుడు జి.శ్రీనివాస్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చిన 1940 అతిథి అధ్యాపకులను కాంట్రాక్టు లెక్చరర్లుగా ఏటా రెన్యువల్ చేస్తూ, 12 నెలల వేతనం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో రెన్యువల్ అయిన లెక్చరర్ల పోస్టులు

జిల్లా	కాంట్రాక్టు లెక్చరర్లు	గెస్టు లెక్చరర్లు
జోగులాంబ గద్వాల	11	52
మహబూబ్‌నగర్	43	105
నాగర్‌కర్నూల్	16	66
వనపర్తి	18	54
నారాయణపేట	4	27
మొత్తం	92	304

హామీలు ఎందుకిచ్చారు?

- ఎంపీ డీకే అరుణ
- 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ 6

వైద్యులకు రోగులు శత్రువులు కాదు

- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ 7

వర్గీకరణతో మాలలకు అన్యాయం

- మాల నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి మేధావులతో కమిటీ వేయాలి 6
- తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్

ఇండోర్ స్టేడియంలో అధునాతన సౌండ్ సిస్టం

- రూ. 42 లక్షల వ్యయంతో ఏర్పాటు
- అంతర్జాతీయ స్టేడియాల్లో ఇలాంటిది ఉంటుంది: డీవైఎస్‌వో శ్రీనివాస్ 6

మత్స్య కార్మికులకు మంచి రోజులు



- మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో జిల్లాలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు
- సంగంబండ రిజర్వాయర్ సమీపంలో స్థల పరిశీలన
- మంత్రి ఆదేశాలతో నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు

నారాయణపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలోని మత్స్య కార్మికులకు మంచి రోజులు రాబోతున్నాయి. రాష్ట్ర పశుసంవర్థక, క్రీడలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవతో జిల్లాలోని మక్తల్ మండలం సంగంబండ రిజార్వాయర్ సమీపంలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ డైరెక్టర్ నిఖిల, మత్స్య శాఖ అధికారులు రిజర్వాయర్ సమీపంలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటుకు కావలసిన స్థల పరిశీలన చేశారు. 20 ఎకరాల్లో కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. మంత్రి ఆదేశాలతో మత్స్య శాఖ ఉన్నతాధికారులు నివేదికలు సిద్ధం చేసే పనిలో పడ్డారు.

లక్ష్యం కోటీ 80 లక్షలు

జిల్లా వ్యాప్తంగా ఏటా వానకాలంలో కోటీ 80 లక్షల చేపలను పెంచాలని లక్ష్యం ఉంది. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టర్‌లకు గత ప్రభుత్వం నిధుల బకాయి ఉండటంతో 65 పెద్ద చెరువుల్లో కేవలం 40 లక్షల పెద్ద సైజు చేప పిల్లలనే మత్స్య శాఖ వదిలింది. ఈసారి అలా కాకుండా అవసరం మేరకు జలాశయాలతో పాటు చెరువుల్లో చేప పిల్లలు వదిలేలా మంత్రి వాకిటి శ్రీహరి చర్యలు తీసుకుంటున్నారు. చేప పిల్లల పంపిణీ కోసం ప్రభుత్వ పరంగా త్వరలోనే నోటిఫికేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంతో ఎంతో ప్రయోజనం ఉటుందని జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు కాంత్‌కుమార్ ముదిరాజ్ అన్నారు.


సంగంబండ రిజర్వాయర్ సమీపంలో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, మత్స్యశాఖ డైరెక్టర్ నిఖిల(ఫైల్)

147 సహకార సంఘాలు..

జిల్లా వ్యాప్తంగా 147 మత్స్య సహకార సంఘాలు ఉన్నాయి. అందులో 11,039 మంది సభ్యులుగా ఉన్నారు. 136 పురుషుల , 11 మహిళా సంఘాలు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 644 చెరువులు, భూత్పూర్, సంగంబండ రిజర్వాయర్లు ఉన్నాయి.

నాణ్యమైన విద్య అందించాలి

- ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యత ఉపాధ్యాయులదే
- పదో తరగతిలో మంచి ఫలితాలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలి
- లక్షా 12 వేల మంది ఉపాధ్యాయులకు డిజిటల్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ
- ఉమ్మడి జిల్లా అధికారుల సమీక్షలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్య అందించాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా అన్నారు. స్కూళ్లను బలోపేతం చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని ఆమె చెప్పారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గల సమావేశ మందిరంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారులు, ఎంఈవోలు, జీహెచ్‌ఎంలు, సెక్టోరియల్ అధికారులతో శాఖపై సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు మౌలిక వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. దేశంలో నాణ్యమైన విద్య అందించడంలో గతంలో తెలంగాణ రాష్ట్రం 36వ స్థానంలో ఉండగా, ఇప్పుడు 26వ స్థానానికి చేరుకున్నదన్నారు. ఉమ్మడి జిల్లాను కూడా రాష్ట్రంలో విద్యాభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. లక్షా 12 వేల మంది ఉపాధ్యాయులకు 12 ఏళ్లలో మొదటి సారిగా డిజిటల్ ఎడ్యుకేషన్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో విద్యాశాఖ కమిషనర్ నవీన్‌నికోలస్, కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు, జేడీ, ఆర్‌జేడీ, ఉమ్మడి జిల్లా డీఈవోలు ప్రవీణ్‌కుమార్, గోవిందరాజులు, రమేశ్, అబ్దుల్‌ఘని తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు


దొడ్డిపల్లిలో పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని రేకుల చౌడాపూర్, జంగమయ్యపల్లి, యన్మనగండ్ల, దొడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. జంగమయ్యపల్లిలో గ్రామ స్వరాజ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రంలో లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందజేశారు. యన్మనగండ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి, సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. దొడ్డిపల్లిలో నూతన గ్రామ పంచాయతీ భవనానికి భూమి పూజ చేశారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, మార్కెట్ చైర్మన్ హరలింగం, వైస్ చైర్మన్ తులసీరాం, మైసమ్మ ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

లారీ టైర్ విప్పుతుండగా ఢీకొన్న మరో లారీ

- భూత్పూర్ డ్రైవర్ అక్కడికక్కడే మృతి 7
- నారాయణపేట జిల్లా మరికల్ మండలం పెద్దచింతకుంట స్టేజీ సమీపంలో ఘటన

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

- పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ 7
- పాలమూరులో చలో కలెక్టరేట్


మాట్లాడుతున్న జిల్లా సహకార సంఘం అధికారి శంకరాచారి

రైతులు నూతన పద్ధతులు పాటించాలి

నవాబ్‌పేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నూతన పద్ధతులు అవలంభిస్తేనే అధిక దిగుబడులు సాధించవచ్చు అని జిల్లా వ్యవసాయ సహకార సంఘం అధికారి శంకరాచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని యన్మనగండ్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఏర్పాటు చేసిన సభ్యత్వ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని, మాట్లాడారు. సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులకు విరివిగా రుణాలు ఇవ్వడంతో పాటు ఎరువులు అందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం చైర్మన్ నర్సింహులు, జిల్లా అడిట్ అధికారి టైటస్ పాల్, నోడల్ అధికారి లావణ్య, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వీరభద్రయ్య, మార్కెట్ చైర్మన్ హరలింగం, వైస్ చైర్మన్ తులసీరాం పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియంలో అధునాతన సౌండ్ సిస్టం

» రూ. 42లక్షల వ్యయంతో ఏర్పాటు


సౌండ్‌సిస్టమ్‌ను పరిశీలిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్ జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఇండోర్‌స్టేడియంలో అధునాతన సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. మ్యాచ్ నిర్వహణ సమయంలో మైక్‌సిస్టమ్ వినియోగిస్తారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ రూ. 42లక్షల వ్యయంతో ఏర్పాటు చేసినట్లు డీవైఎస్‌వో శ్రీనివాస్ బుధవారం తెలిపారు. అంతర్జాతీయ స్టేడియాల్లో ఇలాంటి సిస్టమ్ ఉంటుందని, మహబూబ్‌నగర్ ఇండోర్‌స్టేడియంలో అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. విద్యుత్ ఆదా చేసేందుకు, సోలార్ విద్యుత్ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ప్రభుత్వ క్రీడా సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర క్రీడాశాఖ ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

సుంకేసుల డ్యాంకు కొనసాగుతున్న వరద

రాజోలి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద ఉధృతి కొనసాగుతుంది. బుధవారం 32వేల క్యూసెక్కులు నీరు వస్తుండటంతో ఏడు గేట్ల ద్వారా 29వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 0.845 టీఎంసీ నీరు ఉందని, కర్నూలు కేసీ కెనాల్‌కు 2,300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు జలాశయం జేఈ స్వామి తెలిపారు.

హత్యాయత్నం కేసులో మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలింపు

గద్వాల క్రైం, జులై 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులపై కత్తితో దాడిచేసిన కేసులో ఇటీవలే ఇద్దరిని రిమాండ్‌కు తరలించగా, బుధవారం మరో ఇద్దరు మైనర్లను జువైనల్ హోమ్‌కు తరలించాలని న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని గంజిపేట కాలనీకి చెందిన కళాశాల విద్యార్థులు రవితేజ, చరణ్‌తేజలపై ఈ నెల 9వ తేదీన కోటబురుజు సమీపంలో కొందరు యువకులు కత్తితో దాడిచేసిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించి కేసును నమోదు చేసిన పోలీసులు ఐదు రోజుల క్రితం ఎరుకలి రాజు, ఉదయ్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. బుధవారం దాడికి సంబంధించి మరో ఇద్దరు మైనర్లను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు.

1.5 కేజీల గంజాయి బ్యాగు లభ్యం

» ఇద్దరిపై కేసు నమోదు

వనపర్తి రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గంజాయితో పట్టుబడిన ఇద్దరిపై కేసు నమోదైన ఘటన వనపర్తి పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. టౌన్ ఎస్‌ఐ హరిప్రసాద్ వివరాల మేరకు.. పట్టణంలోని ఓల్డ్ గంజిలో ఇద్దరు వ్యక్తులు బ్యాగుతో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు వారిని పట్టుకున్నారు. బ్యాగులో దాదాపు 1.5 కేజీల గంజాయి ఉండడంతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రి ఎదుట ఆందోళన

» వైద్య ఖర్చులు ఇవ్వాలని డిమాండ్


ఆసుపత్రి ఎదుట బైఠాయించిన రోగి కుటుంబ సభ్యులు

నారాయణపేట టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు ఆసుపత్రి ఎదుట రోగి బంధువులు ధర్నాచే పట్టారు. ధన్వాడ మండలంలోని గోటూరు తండాకు చెందిన సోనిబాయి అనే మహిళా కడపు నొప్పితో గత నెల 23న ఆసుపత్రికి వచ్చింది. ఆమెకు అన్ని పరీక్షలు చేసి, గర్భసంచి ఆపరేషన్ చేయాలని కుటుంబ సభ్యులకు డాక్టర్లు తెలిపారు. అదే ఆసుపత్రిలో 23న సోనిబాయికి ఆపరేషన్ చేసి పంపించారు. ఈ నెల 6న మళ్లీ కడుపు నొప్పి వస్తుందని అదే ఆసుపత్రిలో చేరింది. మరోసారి ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించారు. రెండవసారి ఆపరేషన్ చేసే సమయంలో పేగుని కట్ చేసి మరీ కుట్లు వేశారు. ఆమె పరిస్థితి విషమించ డంతో మహబూబ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి రెఫర్ చేశారు. అక్కడి నుంచి కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తీసుకెళ్లి ప్రవేట్ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ కూడా మరో ఆపరేషన్ చేశారు. మొదట చేసిన ఆపరేషన్లు ఫెయిల్ కావడంతోనే ఇలా జరిగిందని వైద్యులు చెప్పారని సోనిబాయి మరిది రమేష్ తెలిపారు. హైదరాబాద్ ఆసుపత్రిలో వైద్య ఖర్చుల బిల్లులు చెల్లించాలని రోగి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ముందు నారాయణపేటలోని ఆసుపత్రి ఎదుట బైటాయిం చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని ఆస్పత్రి డాక్టర్లు, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. నారాయణపేట ఆసుపత్రి వైద్యులు సమా ధానం ఇస్తూ.. ఆమె ఆపరేషన్‌లో ఎలాంటి నిర్లక్ష్యం లేదని, ఆపరేషన్ తరువాత ఆమె నీళ్లు తాగడంతో సమస్య ఏర్పడిందని తెలిపారు.

రైతులకు రావాల్సిన డబ్బులపై చర్యలు

» మోసగించిన వ్యాపారిని పట్టుకున్న పోలీసులు

» ఎస్పీ ఆధ్వర్యంలో 60శాతం డబ్బులు రికవరీ


రైతులతో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రైతుల వద్ద మొక్కజొన్నలు కొనుగోలు చేసి డబ్బులు ఇవ్వకుండా పరారైన వ్యాపారి నుంచి డబ్బులు ఇప్పించేందుకు ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. బిజినేపల్లి మండలం ఖానాపూర్ నంది వడ్డెమాన్, నల్లవెల్లి గ్రామాలకు చెందిన 56మంది రైతులు వద్ద ఖానాపూర్ చెందిన వ్యాపారి శ్రీనివాసులు రూ.కోటి వరకు మొక్కజొన్నలను కొనుగోలు చేసి, డబ్బులు ఇవ్వకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. ఈ ఘటనపై రెండు నెలల క్రితం నల్లవెల్లి గ్రామానికి చెందిన బుసిరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రైతులు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. దీనిపై ఇద్దరు సీఐలు కనకయ్యగౌడ్, శంకర్‌లతోపాటు పోలీస్ బృందాన్ని ఏర్పాటు చేసి శ్రీనివాస్‌లను పట్టుకున్నారు. తదుపరి ఎంతమందికి రైతులు డబ్బులు ఇచ్చే వారిని నివేదికను రూపొందించి శ్రీనివాసులు దగ్గర నుంచి 56మంది రైతులకు వారు వ్యాపారికి విక్రయించిన మొక్కజొన్న డబ్బులలో 60శాతం చొప్పున ఒక్కొక్క రైతుకు బుధవారం ఎస్పీ కార్యాలయం ఆవరణలో అందించారు. ఈ సందర్భంగా తమకు న్యాయం జరిగిందని రైతులు ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

నాడు రాక.. నేడు చేర్చుకోలేక..

» కస్తూర్బాలకు పోటెత్తిన విద్యార్థులు

» పరిమితికి మించి చేరిక

» వేధిస్తున్న సౌకర్యాల కొరత

» మారిన మెనూతో ఆసక్తి

అలంపూరుచౌరస్తా, జూలై 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన సామాజిక వర్గాలలో బాలురతో పోల్చితే, బాలికల చదువులపై ఉన్న అసమానతలు రూపుమాపేందుకు 2004లో కేంద్ర ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పేరుతో రాష్ట్రంలో ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను నెలకొల్పారు. ఇందులో అనాథలను, చదువుకు దూరమైన బాలికలను, బడి మానేసిన పిల్లలను, నిరుపేద కుటుంబాలలో ఉన్న బాలికలను చేర్చుకోవాలన్న ఉద్దేశం. 75శాతం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వర్గాల బాలికలకు, మిగిలిన 25శాతం దారిద్ర్య రేఖకు దిగువనున్న కుటుంబాల్లోని బాలికలకు కేటాయించాలనే నిబంధన ఉంది.

కస్తూర్బాలకు డిమాండ్

జోగుళాంబ గద్వాల జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 13 కేజీబీవీ పాఠశాలలున్నాయి. ఇందులో ఎర్రవల్లి, రాజోలి, ఇటిక్యాల మండలాలు మినహా అన్ని పాఠశాలలు కళాశాల ఉన్నతికి చేరుకున్నాయి. ఇందులో 1నుంచి 10వ తరగతి వరకు 3,332 మంది విద్యార్థులు ఉండగా, కళాశాల విద్యార్థులు 1,087మంది విద్యనభ్యసిస్తున్నారు. నాలుగేళ్ల క్రితం వరకు విద్యార్థులు లేక ఉపాధ్యాయులు ఊరూరా తిరిగి డ్రాప్ అవుట్ పిల్లలను చేర్చుకునేవారు. నేడు పరిస్థితి భిన్నంగా మారింది. సీటు కోసం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఆశ్రయించి ఎస్‌వోలపై ఒత్తిడి తెచ్చే పరిస్థితి వచ్చింది. ఇందుకు కారణం కొత్త భవనాలు నిర్మించడం, నాణ్యమైన భోజనం అందిస్తుండటం. దీంతో ఒక్కో తరగతికి 40 మంది విద్యార్థులు ఉండాల్సిన చోట వడ్డేపల్లి కేజీబీవీలోని 9వ తరగతిలో 76 మంది విద్యార్థులు చేరారు.


437 మంది బాలికలతో కొనసాగుతున్న వడ్డేపల్లి కేజీబీవీ పాఠశాల, కళాశాల

అన్నీ కొత్త భవనాలే..

జిల్లాలోని 12 కేజీబీవీలు కొత్త భవనాలలో కొనసాగుతుండగా, రాజోలి మండలంలో భవనం నిర్మాణ దశలో ఉండడంతో ఉర్దూ పాఠశాలలో కొనసాగిస్తున్నారు. ఇక్కడ 240 మంది విద్యార్థులు కేవలం ఐదు గదులలోనే సర్దుకుంటున్నారు. మిగతా చోట్ల కొత్త భవనాలు ఉన్నా విద్యార్థుల సంఖ్య పెరగడంతో సౌకర్యాల కొరత ఏర్పడుతుంది. అలంపూరు కేజీబీవీలో 200 ఉండాల్సిన పాఠశాలలో అత్యధికంగా 314, కళాశాలలో 133 మంది ఉన్నారు. ఇలా మొత్తం పరిమితికి మించి 447 మంది విద్యార్థులున్నారు. ఇక్కడ 14 టాయిలెట్స్, 14 వాష్‌రూమ్స్ మాత్రమే ఉన్నాయి. అత్యధికంగా వడ్డేపల్లిలో 437మంది బాలికలు, గట్టులో 415, ఉండవల్లిలో 367, మానవపాడులో 345, ధరూరులో 310, గద్వాల్‌లో 388, అయిజలో 391 మంది బాలికలు చదువుతుండగా రాజోలిలో 240, ఇటిక్యాలలో 278, ఎర్రవల్లిలో 240, కేటీదొడ్డిలో 282, మల్దకల్‌లో 279 చొప్పున 4,419 మంది బాలికలు ఉన్నారు. పరిమితికి మించి ఉన్న చోట్ల గదుల కొరతతో పాటు మూత్రశాలలు, మరుగుదొడ్లు, డైనింగ్‌హాల్, నిద్రపోయేందుకు పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

అవసరమైన వసతులు కల్పిస్తాం



కేజీబీవీలకు విద్యార్థుల తాకిడి పెరిగిన మాట వాస్తవమే. అందుకు అనుగుణంగా వసతులు ఏర్పాటు చేసేందుకు కలెక్టరుకు విన్నవించాం. జిల్లాలో కేజీబీవీలు కళాశాలలుగా ఉన్నతికి చేరిన చోట్ల మూత్రశాలల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. విద్యార్థులు పెరిగినా అందరికీ నాణ్యమైన విద్య, భోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నాం. మరికొన్ని రోజులలో రాజోళి కేజీబీవీ విద్యార్థుల కష్టాలు తొలగిపోతాయి.

- టీ.హంపయ్య, జోగుళాంబ గద్వాల జీఈసీవో

నాణ్యమైన విద్య.. మెరుగైన భోజనం

జిల్లాలో 13 కేజీబీవీ పాఠశాలలు, 10 కళాశాలలు ఉన్నాయి. ఇందులో ఐదు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలు కూడా ఉన్నాయి. బోధించేందుకు 270 మంది సిబ్బంది ఉన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలోనూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మెనూ పూర్తిగా మార్చేశాయి.

భవనం మొత్తానికి ఒక్కరే స్వీపర్

ప్రతీ పాఠశాల, కళాశాలకు కలిపి సుమారు 350మందికి పైగా విద్యార్థులు, పదుల సంఖ్యలో గదులు, 20కి మించి మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉన్నాయి. వీటన్నింటిని శుభ్రం చేసేందుకు ప్రతీ పాఠశాలకు కేవలం ఒక్కరే స్వీపర్ ఉండటం గమనార్హం. వీరికి తోడు ఒక స్కావెంజర్ నియమించారు. అన్ని శుభ్రం చేయాలంటే వారికి తోడు మరో నలుగురు అవసరమని చెబుతున్నారు. ప్రతీ పాఠశాలకు కనీసం నలుగురు స్వీపర్లు, నలుగురు స్కావెంజర్‌లు, ముగ్గురు హెల్పర్లు, ఇద్దరు వాచ్‌మెన్‌లతో పాటు వంట మనుషులనూ పెంచేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆగ్రహించిన సీడ్‌పత్తి రైతులు

» న్యాయం చేయాలని 5 గంటల పాటు రహదారిపై బైఠాయింపు

» అదనపు కలెక్టర్ హామీతో ఆందోళన విరమణ


బింగిదొడ్డి స్టేజి వద్ద గద్వాల రహదారిపై బైఠాయించిన సీడ్‌పత్తి రైతులు

అయిజ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నేలను నమ్ముకొని జీవనం సాగిస్తున్న తమకు సీడ్ ఆర్గనైజర్ల ద్వారా అన్యాయం జరుగుతోందని అన్నదాతలు ఆగ్రహించారు. న్యాయం చేయాలంటూ రోడ్డెక్కారు. వేసిన మొక్కలను తొలగించబోమని, నష్టాన్ని భరించలేమంటూ ఆవేదన వెలిబుచ్చుతూ దాదాపు 5 గంటల పాటు రహదారిపై అడ్డంగా కూర్చుని ఆందోళన చేశారు. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని బింగిదొడ్డి గ్రామ స్టేజీ దగ్గర గద్వాల రహదారిపై చోటు చేసుకున్నది. బుధవారం ఉదయం 8 గంటలకు రైతులు బైఠాయించారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ జ్యోతి, సీఐ టాటాబుబు, ఎస్‌ఐ శ్రీనివాసరావులు సంఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చచెప్పినా వినలేదు. దీంతో దాదాపు 6 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవటంతో ప్రయాణానికి ఇబ్బందిగా మారింది. అటు గద్వాల వైపు, ఇటు అయిజ వైపు 6 కిలోమీటర్లు ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం అందుకున్న గద్వాల డీఎస్పీ మొగులయ్య వచ్చి రైతులకు నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు. రైతులు వినలేదు. కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లను నమ్ముకొని జిల్లా వ్యాప్తంగా 40 వేల ఎకరాల్లో సీడ్ పత్తి సాగు చేశామని, ఎకరానికి 5 క్వింటాళ్ళ దిగుబడి వస్తుందని, తీరా పంట సాగుచేసి 2 నెలలు దాటిన తర్వాత 2 క్వింటాళ్ళ విత్తనాలు మాత్రమే తీసుకుంటాము, మిగతాది తమకు సంబంధం లేదని ఆర్గనైజర్లు చెప్పటంతో గందరగోళ పరిస్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చేసేదిలేక డీఎస్పీ మొగులయ్య అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు ఫోన్ చేసి రైతులతో మాట్లాడించారు. సీడ్ ఆర్గనైజర్లు, రైతులతో కలిసి కలెక్టర్‌తో సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అందుకు కలెక్టర్ కూడా అంగీకరించినట్లు చెప్పారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకాగా, వారికి మద్దతుగా వివిధ పార్టీల నాయకులు, రైతు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హామీలు ఎందుకిచ్చారు?

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

» 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్


మదనాపురంలో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ, చిత్రంలో డోకూర్ పవన్‌కుమార్

మదనాపురం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : అప్పులున్న సంగతి తెలిపి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఎందుకు హామీలు ఇచ్చిందని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ప్రశ్నించారు. బుధవారం వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలో జరిగిన ఓ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ వల్ల అభివృద్ధిలో భారతదేశం ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోగానే లంకెబిందెలు ఉన్నాయని అనుకున్న కానీ ఖాళీ బిందెలు ఉన్నాయన్నారని, ఆయనకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతకు ముందు తెలియదా అని ప్రశ్నించారు. రేషన్ షాపులలో కేంద్రం నుండే ప్రతీ ఒక్కరికి ఐదు కేజీల బియ్యం, మహిళా సంఘాల సభ్యులకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రైతు భరోసా, కౌలు రైతుల సంగతి మరిచిపోయిందన్నారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి ఊసే లేదన్నారు. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇంత వరకు ఏలాంటి హామీలను అమలు చేయకుండా కాలం గడుపుతోందన్నారు. కొత్తకోట మునిసిపాలిటీకి కేంద్ర ప్రభుత్వం తాగునీటి కోసం కేటాయించిన నిధులను ఎమ్మెల్యే ఎందుకు ఖర్చు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావుల రవీంద్రనాథ్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ డోకూరు పవన్‌కుమార్‌రెడ్డి, నాయకులు నారాయణ, ప్రశాంత్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కృష్ణయాదవ్, భరత్ భూషణ్ పాల్గొన్నారు.

వర్గీకరణతో మాలలకు అన్యాయం


సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ భాస్కర్

పాలమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీరని అన్యాయం జరిగింది. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణతో రోస్టర్ విధానంలో మాలలను గ్రూప్ త్రీలోకి మార్చింది. దీంతో మాల సామాజికి వర్గానికి చెందిన విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలు అంధకారమవుతున్నాయని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కన్వీనర్ కనకరాజు, చీఫ్ కో-ఆర్డినేటర్ రవి, వర్కింగ్ చైర్మన్ డాక్టర్ మంత్రి నరసింహయ్య, సేర్వార్ నరసింహతో కలిసి మాట్లాడారు. మాల నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాన్ని తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి మేధావులతో కమిటీ వేసి అధ్యయనం చేయించాలన్నారు. మాల సామాజికవర్గంపై ముఖ్యమంత్రి కక్ష కట్టారని డా.వి.వి స్వామి అన్నారు. త్వరలో హైదరాబాద్‌లో లక్ష మంది మాలలతో సభ నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లా కన్వీనర్ గోపాల్, మంత్రి చెన్నకేశవులు, రాములు, వెంకటేశ్వర్లు, శ్యాంసుందర్, శివకుమార్, నరహరి, చెన్నయ్య, నరేష్, గోవిందు, వెంకటస్వామి, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యుత్ కార్మిక సంఘం డివిజన్ కమిటీ ఎన్నిక

పాలమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూని యన్-327 మహబూబ్‌నగర్ డివిజన్ కమిటీని బుధవారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ కమిటి అధ్యక్షుడిగా ప్రమోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా బలరాం, కోశాధికారిగా అభిలాష్‌సింగ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మల్లికార్జున్, యం.ఏ జకి, రోజారాణి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, పెంటయ్య, భాను ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా గణేష్, మల్లీశ్వరి, యూసూఫ్, లోకేష్, ఇమ్రాన్, రాములు, ఎల్.వీ వెంకటేష్, పి.వెంకటేష్, శివకుమార్, అశోక్, రాజు, నజీర్, ఆఫీసు కార్యదర్శిగా బి.విజయకుమార్ ఎన్నిక య్యారు. నూతనంగా ఎన్నికైన కమిటీతో జిల్లా అధ్యక్షుడు బాబ్య ప్రమాణ స్వీకారం చేయించారు.

సర్వే సరే.. మంజూరెప్పుడో

(5వ పేజీ తరువాయి)

ఉన్నాయి. అది ఆలస్యమయ్యే కొద్ది వ్యయం పెరుగుతూ పోవచ్చు. గద్వాల- డోర్నకల్ మార్గంలో పెద్దగా పరిశ్రమలు లేవు. కేవలం ప్యాసింజర్ రైళ్లను మాత్రమే నడపాల్సి ఉంటుందని రైల్వేశాఖ అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. దీనివల్ల పెట్టిన ఖర్చుకు సంబంధించి రేట్ ఆఫ్ రిటర్న్స్ బ్రేక్ ఈవెన్ పాయింట్‌ను మించేలా కనిపించడం లేదు. కనీసం 10 శాతం రేట్ ఆఫ్ రిటర్న్స్ ఉంటే గ్రీన్ సిగ్నల్ వచ్చే అవకాశం ఉంది. కానీ ఆ మేరకు రెండు రైల్వేలైన్లలోనూ 5 శాతానికి మించడం లేదు. ఈ నేపథ్యంలో ఎఫ్ఎల్ఎస్ పూర్తయినప్పటికీ.. ఇంకా ఎటూ తేల్చుకోలేని స్థితిలో రైల్వేశాఖ ఉంది. సీఎం రేవంత్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ఈ రెండు రైల్వేలైన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపారు. సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేఖ రాశారు. డీకే అరుణ కూడా పలుమార్లు కేంద్రమంత్రిని కలిసి విన్నవించారు. అయితే ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులంతా కలిసికట్టుగా ఈ రెండు రైల్వేలైన్లను వచ్చే బడ్జెట్‌లో మంజూరు చేసే విధంగా కేంద్రంపై ఒత్తిడి తెస్తే మేలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ రెండు రైల్వేలైన్లతో ఉమ్మడి జిల్లా అభివృద్ధి చెందడంతోపాటు రవాణా సదుపాయం మెరుగుపడటం, ఉపాధి పెరగడం సాధ్యమవుతాయని ప్రజలు భావిస్తున్నారు.

డ్రై పోర్టుతో ఆర్‌వోఆర్ సాధ్యమే..

తెలంగాణలో ఎప్పటి నుంచో డ్రైపోర్టు పెట్టాలనే డిమాండ్ ఉంది. మంగళవారం సీఎంవో లాజిస్టికల్ డైరెక్టర్ అపర్ణతోపాటు పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు దేవరకద్రలోని గుడిబండ వద్ద డ్రై పోర్టు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించడంతోపాటు సానుకూలత కూడా వ్యక్తం చేశారు. దేశంలోనే అతి పెద్దదైనా ఎన్‌హెచ్-44 ఉండటం, మూడు రాష్ట్రాల సరిహద్దు ఉండటంతో డ్రై పోర్టుకు ఈ ప్రాంతం అనుకూలంగా ఉంది. రైల్వే కనెక్టివిటీ కూడా ఉంది. ఒకవేళ గూడ్స్ రవాణా ఉంటేనే రైల్వేశాఖ రేట్ ఆఫ్ రిటర్న్స్ చూసుకుని కొత్త రైల్వేలైన్లు మంజూరు చేసే పక్షంలో ముందుగా ఇక్కడ డ్రై పోర్టుకు అంకురార్పణ చేస్తే అటు ఏపీ, తమిళనాడు, ఇటు కర్ణాటక, తెలంగాణ, గోవా, మహారాష్ట్రకు సరుకు రవాణా చేయవచ్చు. అప్పుడు రైల్వేశాఖ అనుకున్న ఆర్‌వోఆర్ సాధ్యమవుతుందనే అంచనాలు ఉన్నాయి. రైల్వేలైన్ వెంట పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా కూడా ఆర్‌వోఆర్ సాధించవచ్చు. అలాగే ఇప్పటికే ప్రతిపాదనల దశలో ఉన్న బెంగళూరు- హైదరాబాద్ డిఫెన్స్ కారిడార్‌కు కూడా ఈ రైల్వేలైన్ దోహదం చేయనుంది. ఆర్‌వోఆర్ అడ్డంకిగా మారే పక్షంలో రాష్ట్ర ప్రభుత్వం డ్రై పోర్టుతోపాటు డిఫెన్స్ కారిడార్ అంశాన్ని కేంద్రం ముందు బలంగా ప్రస్తావించగలిగితే వచ్చే బడ్జెట్‌లో రెండు లైన్లకు పచ్చజెండా ఊపే అవకాశం ఉంది.

తమ్ముడూ అమ్మ జాగ్రత్త...

» వీడియోకాల్ చేసి అన్న ఆత్మహత్య

పెబ్బేరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తమ్ముడూ అమ్మ జాగ్రత్త... అంటూ ఒక అన్న వీడియో కాల్ చేసి ఆత్మహత్య చేసుకున్న సంఘటన వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో చోటుచేసుకున్నది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన వివరాలను బుధవారం ఎస్సై గంగిరెడ్డి యుగేంధర్ రెడ్డి తెలిపారు. అనంతపూర్ జిల్లా గుత్తి మండలం పి కొత్తపల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణకు రేవంత్ కుమార్ (27), కిరణ్ కుమార్ అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. ఐదేళ్ల కిందట తండ్రి మృతి చెందటంతో పెద్ద కుమారుడు రేవంత్ కుమార్ ఇంటి బాధ్యతలను చూసుకుంటున్నాడు. సోమవారం గుత్తి మార్కెట్ నుంచి తన బొలేరో వాహనంలో పచ్చిమిర్చిని తీసుకొని నిజామాబాద్‌కు బయలుదేరాడు. మంగళవారం సాయంత్రం వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీ సమీపంలోని కొత్తకోట బైపాస్ జాతీయ రహదారిపై తన వాహనాన్ని నిలుపుకున్నాడు. తన తమ్ముడు కిరణ్ కుమార్‌కు వీడియో కాల్ చేసి తను చేసిన అప్పుల వివరాలు నోట్‌బుక్‌లో ఉన్నాయని, భూమి అమ్మి అందరి అప్పులు చెల్లించాలని కోరాడు. ఇక నుంచి ఇంటి బాధ్యతతో పాటు అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలని, తాను చనిపోతున్నానంటూ వీడియో కాల్‌లో మాట్లాడుతూ పురుగుల మందు తాగాడు. అన్న మొబైల్ లోకేషన్ పరిశీలించగా పెబ్బేరులో ఉన్నట్లు తెలిసింది. దీంతో సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు, మృతదేహాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎ స్సై తెలిపారు.

4.1 కిలోల నవజాత శిశువు జననం

కందనూలు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఖమ్మం జిల్లాకు చెందిన ప్రియాంకకు పురిటి నొప్పులు రావడంతో ఆసుపత్రికి వచ్చారు. ఆమెకు వైద్యులు చికిత్స అందించగా 4.1కిలోల బరువు గల నవజాత శిశువు జన్మించింది. ప్రసవానంతరం తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా సాధారణ ప్రసవంలో అధిక బరువు గల శిశువు జన్మించడంతో గైనకాలజీ వైద్యులను సిబ్బందికి మెడికల్ సూపరింటెండెంట్ ఉషారాణి అభినందించారు. అనంతరం శిశువును తల్లికి అప్పగించారు. గర్భిణులకు స్త్రీ వైద్య నిపుణులు ప్రత్యేకంగా సోమవారం నుంచి శనివారం వరకు గది నెంబరు 21లో సాధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల గర్భిణులకు స్కానింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ప్రతీ గర్భిణి ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవం చేసుకోవాలని ఆమె సూచించారు. స్త్రీ వైద్య నిపుణులు నీలిమ, సుప్రియ, కే.నికితరెడ్డి, ఝాన్సీ ఎస్.ప్రవళిక, ప్రవీణ్‌కుమార్, నర్సింగ్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆభరణాలు ఎత్తుకెళ్లిన నిందితుడి అరెస్ట్

» రూ.1.50 లక్షల నగదు, వెండి ఆభరణాలు, రెండు బైక్‌లు స్వాధీనం


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ టాటాబాబు

వడ్డేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా శాంతి నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆభరణాల దుకాణంలో జరిగిన చోరీని పోలీ సులు ఛేదించారని సీఐ టాటా బాబు తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలను బుధవారం శాంతినగర్‌లోని పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వెల్లడించారు. ఈ నెల 3న శాంతినగర్ పట్టణంలోని శ్రీనివాస జ్యూవెలర్స్ షాపులో చోరీపై గుజరాతీ శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. షాపులో యజమాని లేకపోవడం గమనించి నగదు, వెండి ఆభరణాలు ఉన్న సంచిని అపహరించి పారిపోయారన్నారు. ఈ కేసులో నలుగురు నిందితులుగా ఉన్నారని తెలిపారు. ఏపీలోని పల్నాడు జిల్లా అచ్చంపేట గ్రామం నిందితుడు బోగిరి రవి పట్టుబడగా పిక్ పాకెటింగ్, చోరీల కేసులో జైలుకు వెళ్లినట్లు విచారణలో వెల్లడైందన్నారు. మరో ముగ్గురు ఒడిశా రాష్ట్రానికి చెందిన సోను, పాలపర్తి శివ, పాలపర్తి ప్రవీణ్ పరారీలో ఉన్నారని, గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. నిందితుడి నుంచి రూ.1.50లక్షల నగదు, ఒక వెండిబార్ (841 గ్రాములు), ఐదు జతల వెండి పాద పట్టీలు (389 గ్రాములు), రెండు పల్సర్ బైకులు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఇతను స్నేహితులతో కలిసి ముఠాగా ఏర్పడి నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

రెండు బైకులు ఢీకొని వృద్ధుడి మృతి


వెంకటయ్య గౌడ్ (ఫైల్)

బిజినేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని కొట్టాల్‌గడ్డ సమీపంలో రెండు బైకులు ఢీకొని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కొట్టాల్‌గడ్డ గ్రామానికి చెందిన వెంకటయ్యగౌడ్ (60), మరో వ్యక్తితో కలిసి బైక్‌పై రోడ్డు దాటుతుండగా పాలెం వైపు నాగర్‌కర్నూల్‌కు బైక్ వెళ్తున్న అరవింద్, భాస్కర్ బలంగా ఢీకొన్నారు. వెంకటయ్యగౌడ్‌కు తీవ్ర గాయాలు కాగా, అరవింద్ చేతి వేళ్లు విరిగాయి. భాస్కర్‌కు తలకు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే జిల్లా ఆసుపత్రికి తరలించారు. వారిని పరిశీలించిన వైద్యులు వెంకటయ్య గౌడ్ మృతి చెందినట్లు తెలిపారు. ఈయన కొంతకాలం క్రితం నాగర్‌కర్నూల్ మండలంలోని చందుబట్ల గ్రామం నుంచి బతుకు తెరువు కోసం కుటుంబంతో వచ్చి కొట్టాల్‌గడ్డలో ఉంటున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

లారీ టైర్ విప్పుతుండగా ఢీకొన్న మరో లారీ

» భూత్పూర్‌కు చెందిన డ్రైవర్ అక్కడికక్కడే మృతి

మరికల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండలంలోని పెద్దచింతకుంట స్టేజీ సమీపన మంగళవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ బోయ బాలకృష్ణ (34) అక్కడిక్కడే మృతి చెందాడు. వివరాలకు వెళితే.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం కర్వెన గ్రామానికి చెందిన లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మహబూబ్‌నగర్ నుంచి మరికల్ వైపు వస్తుండగా పెద్దచింతకుంట స్టేజీ సమీపన లారీ టైర్ పంక్చర్ అయ్యింది. దీంతో డ్రైవర్ బాలకృష్ణ టైర్‌ను విప్పుతుండగా వెనుక నుంచి వచ్చిన కంటైనర్ లారీ డ్రైవర్ శ్రీకాంత్ నిద్రమత్తులో, అతివేగంతో ఢీకొన్నాడు. లారీ డ్రైవర్ అక్కడిక్కడే బాలకృష్ణ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం ఉదయం స్థానిక పోలీసులు ఎస్కవేటర్ సాయంతో ఢీకొన్న లారీని తొలగించారు. మృతుడి తల్లి నాగమణి పిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్లు ఎస్ఐ రాములు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో జైలు శిక్ష

వంగూరు జూలై 16; (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష పడినట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరుకు చెందిన గాజుల దశరథం మద్యం తాగి బైక్ నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. బుధవారం కల్వకుర్తి న్యాయాధికారి ఎదుట హాజరు పరచగా, ఒక రోజు జైలు శిక్ష, రూ. 6 జరిమానా విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఉప్పునుంతల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలంలోని ఉప్పరిపల్లిలో చోటు చేసుకొంది. ఏఎస్ఐ బ్రహ్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్డె చిన్నయ్యకు, తిరుతతయ్య, రాములు మధ్య పొలం వివాదం ఉంది. ఈ క్రమం లో చెన్నయ్యపై తిరుపతయ్య, రాములు దాడి చేశారు. దీంతో ఆయన మనస్తాపం చెంది ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే అచ్చంపేట ఆసుపత్రికి తరలించారు. చెన్నయ్య ఆరోగ్యం నిలకడగ ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడు రాము ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పశువుల చోరీ కేసులో వ్యక్తి రిమాండ్

చారకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని అగ్రహారం తండాలో ఈనెల 14న ఇద్దరి రైతులకు చెందిన రెండు పశువులు చోరీకి గురైయ్యాయి. అదేరోజు బాధిత రైతులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అదే గ్రామానికి చెందిన నేనావత్ సూర్యానాయక్ పశువులను చోరీ చేసినట్లు గుర్తించి కేసు నమోదు చేసి కల్వకుర్తి కోర్టులో బుధవారం హాజరు పరిచారు. అతనికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ శంషుద్దీన్ తెలిపారు.

గురుకుల కళాశాలలో పాము కలకలం

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మండలంలోని శ్రీపురం రోడ్డులో ఉన్న బీసీ గురుకుల కళాశాలలో రక్త పింజరి పాము కలకలం రేపింది. మంగళవారం రాత్రి కళాశాలలోని బాత్‌రూంలో ఉన్న పామును సిబ్బంది గమనించి ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్నేక్ క్యాచర్‌కు సమాచారం ఇవ్వడంతో అతను వచ్చి పామును పట్టి కళాశాలకు దూరంగా బహిరంగ ప్రదేశంలో వదిలి వేశారు. దీంతో గురుకుల కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు.

సైబర్ మోసానికి గురైన పీహెచ్‌డీ విద్యార్థి

» రూ.2.30లక్షలు కాజేసిన వైనం

నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసానికి పీహెచ్‌డీ విద్యార్థి బలైనట్లు ఎస్ఐ గోవర్ధన్ బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. సెప్టెంబరు 2024లో పీహెచ్‌డీ చేసేందుకు ఇంటర్‌నెట్‌లో సెర్చ్ చేస్తుండగా రూ.2.30లక్షల ఇస్తే సీటు ఇస్తామంటూ నమ్మబలికారు. మాయమాటలతో అతని వద్ద డబ్బులు తీసుకుని కనుమరుగైపోయారు. ఈ ఘటనపై అప్పట్లోనే బాధితుడు 1930లో ఫిర్యాదు చేశారు. దీనిపై సైబర్ పోలీసులు బుధవారం నాగర్‌కర్నూల్ పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేయాల్సిందిగా ఆదేశించారు. అందులో భాగంగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌లో సమాచారం అడిగితే చెప్పవద్దని సూచించారు.

అందుబాటులో లేని గంబూసియా

» దోమల వ్యాప్తిని అరికట్టడంలో ఈ చేపలు కీలకం
» వనపర్తి జిల్లాలో మూడు చోట్ల ప్లాంట్ల నిర్వహణ
» ఇప్పటి వరకు ప్రారంభం కాని చేపల పెంపకం


గంబూసియా చేపల ప్లాంటును పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)

వనపర్తి వైద్యవిభాగం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతుంటాయి. ప్రధానంగా దోమలద్వారా వ్యాపించే మలేరియా, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులు జనాలను ఉక్కిరి బిక్కిరి చేస్తాయి. ఈ వ్యాధులను నివారించాలంటే దోమల బెడదను నివారించాల్సి ఉంటుంది. వీటి వ్యాప్తిని అరికట్టడంలో గంబూసియా చేపలు కీలకపాత్ర పోషిస్తాయి. ఇవి నిల్వ నీటిలో దోమల లార్వాలను ఎప్పటికప్పుడు తినేస్తాయి. కానీ వనపర్తి జిల్లాలో గంబూసియా చేపలు అందుబాటులో లేవు. ఈ విషయంపై వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారులు మత్స్యశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. కానీ వర్షాకాలం ప్రారంభమై దాదాపు పక్షం రోజులు గడిచినా వాటిని పంపిణీ చేయలేదు.

మూడు ప్రదేశాల్లో పెంపకం ప్లాంట్లు

గంబూసియా చేపలను పెంచేందుకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు వనపర్తి జిల్లాలోని పెబ్బేరు, పెద్దమందడి, మదనాపూరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్లాంట్లు నిర్వహిస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు గంబూసియా చేపలను వైద్యశాఖ అధికారులకు అందజేస్తారు. వారి ఆధ్వర్యంలో ఈ మూడు ప్లాంట్లలో వాటిని పెంచుతారు. అక్కడి నుంచి జిల్లా వ్యాప్తంగా పంపిణీ చేస్తారు. ఆయా ప్రాంతాల్లో సిబ్బంది నీటి కుంటలతో పాటు, నీరు నిల్వ ఉండే చోట ఈ చేపలను వదులుతారు. దీని వల్ల దోమలవ్యాప్తిని సమర్థవంతంగా అరికట్టే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం మదనాపురం ప్లాంటులో కొన్ని చేపలు ఉన్నట్లు అధికారులు చెప్తున్నా స్పష్టత లేదు. పెబ్బేరు, పెద్దమందడిలలోని ప్లాంట్లను శుభ్రం చేసి, చేపల పెంపకం కోసం సిద్ధంగా ఉంచారు. గంబూసియా చేపలు కావాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గత నెల 30వ తేదీనే మత్స్యశాఖ అధికారులకు లేఖ రాశారు. జూన్ మొదటి వారంలోనే వీటిని జిల్లా వైద్యశాఖకు అప్పగించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటివరకు ఇవ్వలేదు.

గత నెలలోనే లేఖ రాశాం



గంబూసియా చేపల పంపిణీ కోసం జిల్లా మత్స్యశాఖ అధికారులకు గత నెలలోనే లేక రాశాం. మత్స్యశాఖ అధికారులు చేపలను ఇచ్చిన వెంటనే, జిల్లా వ్యాప్తంగా సరఫరా చేస్తాం. మురుగునీటి కుంటల్లో, నెలల తరబడి నిల్వ ఉండే నీటిలో వాటిని వదులుతాం.

– డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారి, వనపర్తి

ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్‌గా రాంప్రకాశ్


ఏడీఆర్ టీ.రాంప్రకాశ్

బిజినేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశోధన కేంద్రం కొత్త ఏడీఆర్‌గా టీ. రాంప్రకాశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంత వాతావరణం, నీటి లభ్యతకు అనువైన కొత్త వంగడాల ఆవిష్కరణకు, పలు పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే రోజు రోజుకు అభివృద్ధి చెందుతున్న యంత్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని వ్యవసాయం చేయడంపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చి రైతుల ఆదాయం పెంచేందుకు కృషి చేస్తానని అన్నారు.

పది యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

ఆత్మకూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జల విద్యుదుత్పత్తి కేంద్రాలలో పది యూనిట్లను ప్రారంభించినట్లను ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎస్ఈ శ్రీధర్ బుధవారం తెలిపారు. ఎగువ కేంద్రంలో 24 గంటల్లో 3.283 మిలియన్ యూనిట్లు, దిగువ కేంద్రంలో 3.283 మిలియన్ యూనిట్లను రాబట్టినట్లు పేర్కొన్నారు.

ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుంటా..

» వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి


గోదాం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి, నాయకులు

పెబ్బేరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన ప్రతీ మాటను నిలబెట్టుకుంటానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మునిసిపాలిటీలో 30 పడలక ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి, వ్యవసాయ మార్కెట్ ఆవరణంలో రైతుల సౌకర్యం కోసం గోదాం నిర్మాణానికి మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్మన్ ప్రమోదిని, విజయవర్ధన్‌రెడ్డిలతో కలిసి భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రితో ప్రజల చిరకాల కోరిక నెరవేరుతుందన్నారు. జాతీయ రహదారికి సమీపంలో ఆసుపత్రి నిర్మాణం కావడంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. పెబ్బేరులో 132కేవి విద్యుత్ కేంద్రం, ఆర్డీవో కార్యాలయం, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం త్వరలో మంజూరు చేయిస్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో సంత స్థలంపై చర్చించా, దానికి సంబంధించిన ఫైల్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుందని, త్వరలోనే సంత చుట్టూ ప్రహరి నిర్మాణం చేపడుతామని తెలిపారు.

అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

మునిసిపల్ కార్యాలయంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థల), జడ్పీ సీఈవో యాదయ్యతో కలిసి అభివృద్ధి పనులపై మునిసిపల్, ఎంపీడీవో కార్యాలయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. చేపడుతున్న అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అడిగి తెలుసుకున్నారు. రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన బాధితులకు త్వరలోనే పట్టాలు పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. డీఎంహెచ్‌వో శ్రీనివాసులు, కాంగ్రెస్ నాయకులు అక్కి శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రాములు, వెంకటేష్‌సాగర్, సురేందర్ గౌడ్, మల్లేష్ యాదవ్ పలువురు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

» పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన


తెలంగాణచౌరస్తాలో ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యార్థులకు ఇవ్వాల్సిన పెండింగ్ స్కాలర్ షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో చలో కలెక్టరేట్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణచౌరస్తాలో ధర్నా చేపట్టారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి సాయికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీతారామ్ మాట్లాడారు.. పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వ విద్యారంగాన్ని పట్టించుకోలేదని, అదేబాటలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొనసాగుతుందన్నారు

కొనసాగుతున్న ఎంజీకేఎల్ఐ నీటి విడుదల

» గుడిపల్లి గట్టు రిజర్వాయర్‌కు నీరు చేరే దాకా..
» ఎల్లూరు రిజర్వాయర్, సింగోటం శ్రీవారి సముద్రం చేరిన వరద
» రెండు టీఎంసీల నీటి ఎత్తిపోత

కొల్లాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా ప్రజల దాహార్తి, రైతులకు సాగునీరు అందించే ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల ఈ నెల 8వ తేదీ నుంచి కొనసాగుతుంది. బుధవారం వరకు రెండు టీఎంసీల నీరు ఎత్తిపోశారు. ఎల్లూరు రిజర్వాయర్, సింగోటం శ్రీవారి సముద్రం, జొన్నల బొగుడ రిజర్వాయర్, గుడిపల్లి గట్టు రిజర్వాయర్ వరకు వరద చేరాక విడుదల ఆపనున్నట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు. ఎల్లూరు రిజర్వాయర్ ద్వారా ఉమ్మడి జిల్లా పరిధి ప్రాంతాలకు మిషన్ భగీరథ పథకం తాగునీరు అందిస్తున్నారు. సాగునీరు విడుదల కావడంతో సింగోటం శ్రీవారి సముద్రం వరద జలాలతో నిండుకుండలా మారింది. జొన్నలబొగుడ రిజర్వాయర్, గుడిపల్లి గట్టు రిజర్వాయర్‌కు వరద సమృద్ధిగా చేరి, వర్షాలు పడనంత వరకు ప్రాజెక్టు ద్వారా నీటి విడుదల ఉంటుందని డీఈ లోకిలాల్ వెల్లడించారు.

‘నెట్’ ఇంట్లో పాఠాలు



వనపర్తి విద్యావిభాగం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అకాడమీ పుస్తకాలను పంపిణీ చేసింది. నిత్యం పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠాలను విని నేర్చుకోవచ్చు. కానీ అనివార్య కారణాలతో పాటు అనారోగ్య, ఇతరాత్ర సమస్యలతో పాఠశాలకు వెళ్లని విద్యార్థులు ఆ రోజు బోధించే పాఠాలకు దూరం కావాల్సి వస్తుంది. ఆ పాఠాలను మళ్లీ వినడానికి ఆస్కారం ఉండేది కాదు. ఇది గమనించిన రాష్ట్ర విద్యాశాఖ ఒకటి నుంచి 10వ తరగతి వరకు పంపిణీ చేసిన అన్ని సబ్జెక్టులకు సంబంధించిన పుస్తకాలపై క్యూఆర్ కోడ్ నమోదు చేసింది. ఈ పుస్తకాలను ఇది వరకే విద్యార్థులకు పంపిణీ చేసిన విషయం తెలిసిందే.

దీక్ష యాప్ ద్వారా..

పాఠశాలకు వెళ్లకుండా పాఠ్యాంశాలలో వెనుకపడిన విద్యార్థులు ఆయా పాఠాల్లో పట్టు సాధించడానికి రాష్ట్ర విద్యాశాఖ దీక్ష యాప్‌ను ఇంటర్నెట్‌లో పొందుపరిచింది. విద్యార్థులు ఈ యాప్‌ను తమ సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్‌లోకి ప్రవేశించి కోరిన అంశాలను నమోదు చేయాలి. అనంతరం పంపిణీ చేసిన పాఠ్య పుస్తకాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమకు నచ్చిన పాఠ్యాంశాన్ని చూడవచ్చు. విద్యార్థులకైతే వివిధ రూపాల్లో విద్యార్థుల మానసిక స్థాయికి అనుగుణంగా దృశ్య రూపంలో బోధించడం జరుగుతుంది. ఈ యాప్‌ను అందింపుచ్చుకుంటే అటు విద్యార్థులకు ఇటు ఉపాధ్యాయులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.

విద్యార్థులు యాప్‌ను వినియోగించుకోవాలి



విద్యార్థులకు ఉపాధ్యాయుడు తరగతి గదిలో బోధించే పాఠ్యాంశం అర్థం కాకున్నా ఇంటి దగ్గర మరొకసారి ఇంటర్నెట్‌లో పాఠ్యాంశాన్ని వినే వెసులుబాటు ఉంటుంది. ఎప్పటికప్పుడు విద్యార్థులు పాఠ్యాంశంపై పట్టు సాధించవచ్చు. దీక్ష యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థుల పాఠ్య పుస్తకంపై ముద్రించిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి, పాఠ్యాంశాన్ని నేర్చుకునే అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

– గురు రాజు యాదవ్, ప్రధానోపాధ్యాయుడు, బాలుర ఉన్నత పాఠశాల, వనపర్తి

రాష్ట్రంలో టీడీపీకి పూర్వవైభవం

» ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్


శాంతినగర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, నాయకులు

వడ్డేపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో తెలుగు దేశం పార్టీకి పూర్వ వైభవం వస్తుందని ఏపీ ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ అన్నారు. బుధవారం జోగుళాంబ గద్వాల జిల్లా మునిసిపాలిటీ కేంద్రమైన శాంతినగర్‌లో టీడీపీ నాయకుడు పూర్ణచంద్రారావు సతీమణి ఇటీవల మృతి చెందడంతో కుటుంబాన్ని ఎమ్మెల్సీ పరామర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలోనే టీడీపీ ఆవిర్భవించిందని, మళ్లీ పూర్వవైభవంతో పాటు అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతీ గ్రామంలో పార్టీకి నిజమైన కార్యకర్తలు ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు తెలంగాణపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు చెప్పారు. టీడీపీ సభ్యత్వం తీసుకున్న వారికి అనేక సదుపాయాలు ఉన్నాయన్నారు. అంతకుముందు ఎమ్మెల్సీ దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో చాణక్య, రఘు, వెంకటరామయ్య, గోపాల్‌రావు, వెంకటేశ్వరరావు, సుధాకర్, సుబ్బారావు పాల్గొన్నారు.

అలంపూర్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు

అలంపూరు : జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలో ఎమ్మెల్సీ జనార్దన్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు.

వైద్యులకు రోగులు శత్రువులు కాదు

» ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్



ర్యాలీగా వెళ్తున్న ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల డాక్టర్లు, సిబ్బంది

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూలై 16 (ఆంధ్రజ్యోతి): వైద్యులకు రోగులు శత్రువులు కాదని, వారి రోగమే శత్రువని, రోగిని చంపాల్సిన అవసరం వైద్యుడికి లేదని.. కేవలం ప్రాణాలు పోయడమే తమ విధి అని ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. వైద్యులపై దాడికి నిరసనగా బుధవారం పట్టణంలోని ప్రైవేట్ డాక్టర్ల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. సోమవారం అర్ధరాత్రి నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన నేనావత్ దేవమ్మ(63) శెట్టికాంప్లెక్స్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతి చెందింది. మృతురాలి బంధువులు ఆసుపత్రిపై దాడి చేయడంతో పాటు మాట్లాడటానికి వెళ్లిన ఐఎంఏ అధ్యక్షుడిపై దాడి చేశారు. ఈ మేరకు జనరల్ ఆసుపత్రి, ప్రైవేటు వైద్యులు, సిబ్బంది కలిసి ఆసుపత్రి నుంచి ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ .. ఎన్నో ప్రాణాలు కాపాడే వైద్యులపై దాడులు చేయడం హేయమైన చర్య అని అన్నారు. ఇకపై దాడులు చేస్తే వైద్యసేవలు నిలిపివేస్తామని, దీంతో రోగులకే నష్టం కలుగుతుందన్నారు. అనంతరం ర్యాలీగా బస్టాండు సమీపంలోని అంబేద్కర్ చౌరస్తా వరకు వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు.

న్యూస్ బాక్స్

ప్రజా సంక్షేమమే ధ్యేయం

కోయిలకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో కోయిలకొండ మండలానికి చెందిన 18 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

భూత్పూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నాసాగర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు బోయ చెన్నయ్య తల్లి బాలమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వెల్కిచర్లను ఎస్సీ రిజర్వు చేయండి

భూత్పూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో వెల్కిచర్ల గ్రామాన్ని ఎస్సీ రిజర్వుగా ప్రకటించాలని కోరుతూ గ్రామానికి చెందిన దళితులు మహబూబ్‌నగర్‌లో బుధవారం ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందించారు. దళిత సంఘం నాయకులు రాము, యాదయ్య, మిద్దె చెన్నయ్య, కుమ్మెర కృష్ణయ్య, నర్సిములు, తిరుపతయ్య పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలి

మూసాపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మూడు నెలలుగా వేతనాలు అందడం లేదని ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు బుధవారం ఎంపీడీవో కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వం స్పందించి తమకు నెలవారీగా వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో కృష్ణయ్యకు అందజేశారు. క్షేత్ర సహాయకులు చంద్రశేఖర్, యాదయ్య, కృష్ణ, రామకృష్ణ, శ్రీలత, ఖాసీం పాల్గొన్నారు.

ప్రొటెక్టివ్ కిట్లు పంపిణీ

మహబూబ్‌నగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : శానిటేషన్, సెప్టిక్‌ట్యాంక్ క్లీనింగ్, సీవర్ నెట్‌వర్క్ ఆపరేటర్లకు ఆయుష్మాన్ కార్డ్స్, పర్సనల్ ప్రొటెక్టివ్ కిట్స్‌ను బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి 10 మందికి అందజేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకంలో కార్పొరేషన్ పరిధిలో పనిచేసే 34 మంది ఎంపిక కాగా, వీరికి రూ.5 లక్షల ప్రమాద బీమా ఉంటుందన్నారు. శానిటరి ఇన్‌స్పెక్టర్ వజ్రకుమార్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ చరణ్‌రెడ్డి, ఎస్‌బీఎం కన్సల్టెంట్ సుమిత్ పాల్గొన్నారు.

బీసీలకు చట్టసభలలో రిజర్వేషన్ కల్పించాలి

పాలమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు చట్టసభలలో రిజర్వేషన్ కల్పించాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బుర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలతోపాటు విద్యా, ఉద్యోగాల్లో 42శాతం బీసీ రిజర్వేషన్ బిల్లు అసెంబ్లీలో ఆమోదించిన బిల్లు అమలుకై కేంద్రం రాజ్యాంగ సవరణ చేసి, తెలంగాణ రాష్ట్రాన్ని ఆర్టికల్ 9 చేర్చి సహకరించాలన్నారు. సమావేశంలో వెంకటేష్, శ్రీనివాసచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బదిలీల తర్వాతే పదోన్నతులు చేపట్టాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల బదిలీలు చేపట్టిన తర్వాతే పదోన్నతులు చేపట్టాలని కోరుతూ బుధవారం విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాకు టీఎస్‌జీహెచ్ఎంఏ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అనంతప్ప, జగదీష్, కోశాధికారి అబ్దుల్‌హాక్ వినతి పత్రం అందజేశారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

మిడ్జిల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో పార్వతమ్మ ఆంజనేయులుకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి కాంగ్రెస్ నాయకుడు వెంకట్‌రెడ్డి బుధవారం భూమిపూజ చేశారు. పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, చుక్కయ్య, పెద్ద వెంకటయ్య, యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు శివాజీ, నాయకులు గోపాల్, హుస్సేన్, బాల్‌రాజ్, నరేష్, రాములు, కృష్ణయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

రెగ్యులర్ డీఈవో, ఎంఈవోలను నియమించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రెగ్యులర్ డీఈవో, ఎంఈవోలు లేక విద్యా వ్యవస్థ కుంటుపడుతోందని, అందుకు వెంటనే రెగ్యులర్ డీఈవో, ఎంఈవోలను నియమించాలని బుధవారం విద్యాశాఖ కార్యదిర్శి యోగితారాణాకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ గ్రాడ్యుయేషన్ అసోసియోషన్ అధ్యక్షుడు భరత్, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్, రాజేష్ వినతి పత్రం అందజేశారు.

కెరీర్ గైడెన్స్‌పై కార్యక్రమం

జడ్చర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థినులకు కెరీర్ గైడెన్స్ అంశంపై బుధవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలోని టీఎస్‌కేసీ మరియు ఒబీద్ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించడంతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళ సాధికారత దిశగా అవసరమయ్యే సామర్థ్యాలకు చేయాల్సిన కృషిని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుకన్య, నర్మద, నాగలక్ష్మీ, ప్రతాప్ సంస్థ ప్రతినిధులు కృప, అఖిల, శిరీష పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా బండమీదిపల్లి

ఆంధ్రజ్యోతి వార్డు వాచ్



- రూ.4 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం
- ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాల ఏర్పాటు



13వ వార్డులో వేసిన సీసీ రోడ్డు

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 13వ వార్డులోని బండమీదిపల్లి గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతోంది. 2013 వరకు గ్రామ పంచాయతీగా ఉన్న గ్రామం మునిసిపాలిటీలో విలీనమైంది. అంతకుముందు రూరల్ మండలంలోని అల్లీపూర్, బండ మీదిపల్లి గ్రామాలు కలిపి ఎంపీటీసీ స్థానంగా ఉండేది. విలీనం అనంతరం వార్డులో గొల్లబండ తండా, రాజీవ్ గృహకల్ప, వడ్డెరబస్తీ, బుడగ జంగాలకాలనీ, బ్యాంకుకాలనీ, శ్రీనివాస కాలనీ, శివాలయం కాలనీలు కలిపి వార్డుగా ఏర్పాటైంది. ఈ వార్డులో 5 వేల జనాభా ఉండగా, 3,600 ఓటర్లు ఉన్నారు. బీఆర్ఎస్ హయాంలో తాగునీటి సమస్యలు పరిష్కారమైంది. కానీ వార్డు పరిధిలోని పలు కాలనీలకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు మంజూరు కాలేదు. ఇటీవల ప్రభుత్వం మారిన తర్వాత పురపాలిక పాలక వర్గం కూడా మారింది. ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే యెన్నం మునిసిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక నిధులు కేటాయించారు. దాదాపు రూ.4 కోట్లతో అన్ని కాలనీల్లో సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపర్చారు. తెలంగాణ ఫైనాన్స్ నిధులు రూ.70 లక్షలతో వివిధ ప్రాంతాలో అభివృద్ధి పనులు చేపట్టారు. మొత్తంగా వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో 80 శాతం అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఇంకా 20 శాతం పనులు మిగిలి ఉన్నాయి.

80 శాతం పనులు పూర్తి ..



కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే యెన్నం సహకారంతో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేశాం. ఇప్పటికే 80శాతం పనులు పూర్తి అయ్యాయి.

- లక్ష్మి, మాజీ కౌన్సిలర్

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి..



వార్డు పరిధిలో విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. అల్లీపూర్‌లో విద్యుత్ ఉప కేంద్రం ఉన్నందువల్ల గ్రామీణ ప్రాంతంలో సరఫరా అయిన ట్లుగా మాకు అవుతుంది. పాలమూరు యూనివర్సిటీ ప్రాంతంలో విద్యుత్ ఉప కేంద్రం నిర్మిస్తే సమస్య పరిష్కారం అవుతుంది.

- యాదగిరిగౌడ్, కాంగ్రెస్ నాయకుడు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి..



వార్డు పరిధిలో విద్యా సంస్థలు అధిక సంఖ్యలో ఉన్నాయి. విద్యార్థులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. జమ్ములమ్మనగర్ కాలనీ నుంచి నిత్యం వివిధ వార్డులకు చెందిన ప్రజలు వస్తుంటారు. అందరి జాగ్రత్తల కోసం అన్ని కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

- బండారి కృష్ణయ్య

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా



పీయూలో వసతులను పరిశీలిస్తున్న విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఆదేశించారు. బుధవారం జిల్లా పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని నిర్మిస్తున్న డైట్ కళాశాల నూతన భవనాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ నవీన్‌నికోలస్, కలెక్టర్ విజయేందిర బోయి, అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం డైట్ కళాశాల ఛాత్రోపాధ్యాయులతో శిక్షణ సంబంధించిన విషయాలు అడిగి తెలుసుకున్నారు. షాషాబ్‌గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో పలు అంశాలపై సమీక్షించారు. 2024-25 ఏడాది పదో తరగతి ఫలితాలపై ఆరా తీశారు. వంట ఏజెన్సీ సభ్యులతో మా ట్లాడుతూ మధ్యా హ్న భోజనం బిల్లు లు వస్తున్నాయా? పెండింగ్‌లో ఉన్నాయా? అంటూ అ డగగా బిల్లులు న రిగ్గా రావడం లేద ని, గుడ్డుకు రూ.5 ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు నెలల బిల్లులు రూ.4.50 లక్షలు రావాలన్నారు. అంతకుముందు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నవీన్‌నికోలస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గతం కంటే పెరిగిందన్నారు. ప్రాథమిక పాఠశాలలో 40 మంది విద్యార్థుల కంటే ఎక్కువ ఉంటే ఆ పాఠశాలలో ఏఐ తరగతులు ప్రారంభిస్తామన్నారు. విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ వెంకటనర్సమ్మ, ఆర్జేడీ విజయ లక్ష్మి, డీఈవో ప్రవీణ్‌కుమార్, సీఎంవో బాలుయాదవ్, ఏఎంవో శ్రీనివాస్, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ మేరజుల్లా ఖాన్, ఎంఈవో లక్ష్మణ్‌సింగ్ పాల్గొన్నారు.

లా, ఇంజనీరింగ్ కళాశాలకు ఏర్పాట్లు చేయాలి

పాలమూరు యూనివర్సిటీ : పీయూలో నూతనంగా ఈ విద్యా సంవత్సరం ఏర్పాటు చేస్తున్న లా, ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితారాణా యూనివర్సిటీ అధికారులను ఆదేశించారు. పీయూ పరిపాలన భవనంలో ఉన్నత విద్యా కమిషనర్ దేవసేన, పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్ బాబుతో సమీక్షించారు. పీయూకి అదనంగా కావల్సిన ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఇంజనీరింగ్ బాలికల హాస్టల్స్‌కు కావల్సిన వసతులకు ఇప్పటికే నిధులు విడుదల చేస్తామన్నారు. అధికారులు డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ ప్రవీణ పాల్గొన్నారు.

భవిత కేంద్రం నిర్వహణపై అసంతృప్తి

జడ్చర్ల : జడ్చర్ల ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా, ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డితో కలిసి ఏఐ కంప్యూటర్ తరగతులను బుధవారం ప్రారంభించారు. అంతకముందు మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న భవిత కేంద్రం నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రానికి మంజూరైన రూ.3 లక్షలతో టాయిలెట్స్ నిర్మాణం, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అర్థమయ్యే విధంగా గోడలకు వేయాల్సిన వివిధ చిత్రాలను వేయించకపోవడం, విద్యార్థుల వైద్య పరీక్షలకు సంబంధించిన వివరాల నమోదు రిజిస్టర్ లేకపోవడం, మధ్యాహ్న భోజనం అందించకపోవడంపై భవిత ఐఆర్‌పీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల కోసం అందించే రవాణా సదుపాయంతో వాహనాలు ఏర్పాటు చేయాలన్నారు. జడ్చర్ల ఎంఈవో కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. ఎంఈవో మంజులాదేవి పాల్గొన్నారు.

ఎరువుల కొరత సృష్టిస్తే లైసెన్స్ రద్దు



ఫర్టిలైజర్ దుకాణంలో ఎరువుల నిల్వను పరిశీలిస్తున్న ఏడీఏ

కోయిలకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువుల కొరత సృష్టిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ ఏడీఏ రామ్‌పాల్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని వింజమూరు, సూరారం, కోయిలకొండలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేసి, ఎరువుల నిల్వలను పరిశీలించారు. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏవో యామారెడ్డి పాల్గొన్నారు.

‘గొర్రెల కాపరికి న్యాయం చేస్తాం’

రాజాపూర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుచ్చర్‌కల్‌లో మంగళవారం కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందగా, బుధవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి గ్రామానికి చేరుకొని గొర్రెల కాపరి ఎర్ర మల్లయ్యను గొర్రెల మృతి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రూ.20 వేలు అందజేశారు. ప్రభుత్వం నుంచి న్యాయం చేయడానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గొల్ల కురుమ యాదవ సంఘం జిల్లా చైర్మన్ శాంతయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణయ్య, ఏఎంసీ డైరెక్టర్ రమణ, గోనెల రమేష్, గోవర్ధన్‌రెడ్డి, నసీర్‌బైగ్, కృష్ణయ్యగౌడ్, సత్యం పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను గెలిపించాలి



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఉమ్మడి మండల సమన్వయ కమిటీ సభ్యులు

మూసాపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపర్చిన అభ్యర్థులను గెలిపించడానికి ప్రతీ ఒక్కరు సమన్వయంతో పనిచేయాలని అడ్డాకుల కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తోట శ్రీహరి అన్నారు. అడ్డాకుల మండలం కందూరు, సుంకురామయ్యపల్లి గ్రామాల్లో బుధవారం కాంగ్రెస్ ఉమ్మడి మండల సమన్వయ సభ్యులు పర్యటించి, ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ప్రతిపక్ష పార్టీ వారు చేస్తున్న అబద్ధపు ప్రచారాలు, ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి ఎమ్మెల్యే జీఎంఆర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం బాధితులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, మూసాపేట మండల అధ్యక్షుడు శెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ బగ్గి కృష్ణయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామన్‌గౌడ్, బాలనర్సింహులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్, నాయకులు విజయమోహన్‌రెడ్డి, నిరంజన్, తిరుపతయ్య, నరేందర్‌చారి, రాములు, దేవన్న యాదవ్, దేవేందర్‌రెడ్డి, శకుంతలమ్మ, సంతోషి, చెన్నమ్మ, వేగనాథ్ పాల్గొన్నారు.

మౌంట్ బాసిల్ పాఠశాలలో ఎన్‌సీసీ తరగతులు ప్రారంభం



ఎన్‌సీసీ అధికారులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డైరెక్టర్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రం సమీపంలోని మౌంట్ బాసిల్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఎన్‌సీసీ తరగతులు కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎస్‌కే సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటు క్రమశిక్షణ దేశభక్తి అవసరం అన్నారు. కళాశాల చైర్మన్ చంద్రకళావెంకటయ్య, శిరీష ప్రవీణ్, పూజిత మోహన్‌రెడ్డి, సుశాంత్‌కృష్ణ, ఎన్‌సీసీ ఆఫీసర్స్ జవాగ్‌సింగ్, హవిల్‌దార్ రణ్‌బీర్‌సింగ్, సునిల్ సింగ్, జీసీఐ శిరీష పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

మూసాపేట, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జానంపేట గ్రామానికి చెందిన వడ్ల సురేష్ ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో స్పందించిన 2001-02 పదో తరగతి విద్యార్థులు భానుచందర్‌రెడ్డి, సంపత్‌కుమార్, రమేష్, ఆంజనేయులు, నరేష్, మహేష్ రూ.10 వేల ఆర్థిక సాయం బుధవారం మృతుడి భార్య మానసకు అందజేశారు.

ఎంఈవో సేవలు అభినందనీయం

కోయిలకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతిలో కోయిలకొండ మండలంలో 97 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి మొదటి స్థానంలో నిలవడంతో ఎంఈవో వెంకట్‌జీని విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా అభినందించారు. బుధవారం కలెక్టర్‌లో కలెక్టర్ విజయేందిన బోయితో కలసి సత్కరించి, ప్రశంసా పత్రం అందించారు.

డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభం

జడ్చర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మునిసిపాలిటీ కావేరమ్మపేటలోని డబుల్ బెడ్ రూంల వద్ద మునిసిపాలిటీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించే డ్రైనేజీ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రారంభించారు. మునిసిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, కౌన్సిలర్‌లు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డిప్యుటేషన్‌పై పంపడంలో.. ఆంతర్యం ఏంటి



విలేకరుల సమావేశంలో పాల్గొన్న బీజేపీ మండల నాయకులు

మిడ్జిల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో విధులు నిర్వహించేందుకు వచ్చిన ఎంపీవోను అధికార పార్టీ నాయకులు భయభ్రాంతులకు గురిచేసి, డిప్యుటేషన్‌పై వెళ్లేలా వత్తిడి తీసుకరావడంలో ఆంతర్యం ఏంటని బీజేపీ మండల అధ్యక్షుడు నరేష్‌నాయక్ ప్రశ్నించారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిజాయితిగా పనిచేసే అధికారులను ఇక్కడ పనిచేయనివ్వారా.. లేక తమ మాట వినరనే భయంతోనే డిప్యుటేషన్‌పై పంపారా అని ఆరోపించారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారుల కొరత ఉన్నప్పటికీ, వచ్చిన అధికారులను డిప్యుటేషన్‌పై పంపడం సమంజసం కాదన్నారు. అధికారి డిప్యుటేషన్ వెనుక కాంగ్రెస్ పెద్దల హస్తం ఉందని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, నాయకులు వెంకటయ్య, రాములు, నవీన్, అరవింద్, పర్వతాలు, జంగయ్య, బాబు, అంజి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు భూమిపై హక్కు కల్పించాలి

పాలమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : తరతరాల నుంచి దళితులు సాగు చేసుకుంటున్న భూమిపై హక్కు కల్పించాలని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తమ భూములపై తమకు హక్కు కల్పిస్తూ పట్టాలివ్వాలని చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు మద్దతుగా మాదిగ జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపాల్, మైనార్టీ నాయకులు మద్దతు ప్రకటించి మాట్లాడారు. భూమిపై హక్కు కోసం దళితులు చేస్తున్న పోరాటం న్యాయమైందన్నారు. అనంతరం తెలంగాణ చౌరస్తాలో రాస్తారోకో చేయటంతో పోలీసులు అరెస్టు చేసి సొంతపూచికత్తుపై విడుదల చేశారు. వెంకటయ్య, బాలనాగయ్య, సత్యం, మహేష్, పెంటమ్మ, నరసమ్మ, కృష్ణ, బాలయ్య, రాములు, నరసింహులు, మన్నెం, శ్యాంశంకర్, మధు, మహేష్, శంకరయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

పాలమూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు పెన్షన్ రూ.9 వేలు, పనిగంటలు పెంచుతూ తెచ్చిన జీవో నెం.282ను వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో టీయూసీఐ జిల్లా కమిటీ సమావేశానికి హాజరై మాట్లాడారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జూలై 31న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దేవదానం, సాంబశివుడు, బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కొండన్న, అరుణ, వెంకట్‌రాములు, బాలు, వెంకటేష్‌గౌడ్, కుర్మయ్య, బాలస్వామి, కవిత, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గంధోత్సవం



దర్గాలో చాదర్ సమర్పించి ప్రార్థనలు నిర్వహిస్తున్న మత పెద్దలు

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రామయ్యబౌలీలో గల హజ్రత్ షేక్ రఫియోద్దీన్ షా ఖాద్రీ దర్గా, షేక్ అబ్దుల్ రహిమాన్ హుస్సేన్ షర్ఫీ ఉర్సు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి దర్గా ముతవల్లీ షేక్ సైఫొద్దీన్ ఆధ్వర్యంలో గంధోత్సవం నిర్వహించి, దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అల్మాస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన యాదే హుస్సేన్ ధార్మిక సదస్సులో హైదరాబాద్‌కు చెందిన ధార్మిక వేత్త మౌలానా మహ్మద్ రఫీయోద్దీన్ హుస్సేనీ, సయ్యద్ మహమూద్ హుస్సేనీ, ఖాజా మొహి యోద్దీన్, అబ్దుల్ మొయిజ్ ధార్మిక సందేశం ఇచ్చారు. సయ్యద్ యూసుఫ్‌షర్ఫీ, సయ్యద్ సుల్తాన్ చిస్తీ, హకీమ్ మొహియోద్దీన్ పాల్గొన్నారు.

తల్లికి గుర్తుగా మొక్క నాటాలి



మొక్క నాటుతున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మేరా యువ భారత్ ఆధ్వర్యంలో గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (మహిళలు) మహబూబ్‌నగర్ నందు బుధవారం ఏక్ పేడ్ మాకేనామ్ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ మై భారత్ కో-ఆర్డినేటర్ కోటాకానాయక్ పాల్గొని మొక్కలు నాటారు. అనంతరం ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవం పురస్కరించుకొని వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి దివ్య, మీనాక్షి, నవ్యకు బహుమతులు అందజేశారు.

పథకాల అమలులో నిర్లక్ష్యం వద్దు

కోయిలకొండ, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని ఎంపీడీవో కాళప్ప సూచించారు. బుధవారం మండల కార్యాలయంలో అధికారుల సమీక్ష సమావేశంలో పాల్గొని, మాట్లాడారు. గ్రామ పంచాయతీ అవార్డుల కోసం కార్యదర్శులు ప్రతిపాదనలు పంపాలని, ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో వేగం పెంచి, వందశాతం చేపట్టాలన్నారు. మండలంలో 2024-25 ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రారంభమైందని, గ్రామాల్లో జరిగిన పనుల వివరాలు అందించాలన్నారు. ఎస్ఐ తిరుపాజీ, ఎంపీవో రాజేశ్వర్‌రెడ్డి, ఐకేపీ ఏపీఎం మల్లేష్, ఏఈలు పరుశురాంరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

బాలానగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పీఆర్టీయూ పనిచేస్తుందని జిల్లా అధ్యక్షుడు మధన్‌మోహన్‌యాదవ్ అన్నారు. బుధవారం మండలంలోని నేరళపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు.

● హన్వాడ : పీఆర్టీయూ మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు స్వామి, విజయానందరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని చిన్నదర్పల్లి, పెద్దదర్పల్లి, కొత్తపేట, హన్వాడ, ఇబ్రహీంబాద్, ఎనమీదతండా, పిల్లిగుండు తండా పాఠశాలల్లో సభ్యత్వ నమోదు నిర్వహించారు. మండల అధ్యక్షుడు స్వామి, ప్రధాన కార్యదర్శి విజయానంద్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుర్మన్న, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, మండల కార్యదర్శి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

బోనస్ చెల్లించాలి



తహసీల్దార్‌కు వినతి ఇస్తున్న బీజేపీ కిసాన్‌మోర్చా నాయకులు

జడ్చర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రకటించిన విధంగా సన్నరకం వరికి క్వింటాలుకు ఇస్తామన్నా రూ.500 బోనస్ వెంటనే చెల్లించాలని బుధవారం తహసీల్దార్ నర్సింగ్‌రావుకు బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు వినతిపత్రం అందజేశారు. లేకుంటే రైతుల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంబీ బాలకృష్ణ, జిల్లా అధికార ప్రతినిధి బుక్క నవీన్, మురళీకృష్ణ, అమర్‌నాథ్ గౌడ్, ముచ్చర్ల కృష్ణయ్య, ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సామల నర్సిములు, శ్రీకాంత్, మోహన్‌నాయక్ పాల్గొన్నారు.

పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌ను పూర్తి చేయాలి

జడ్చర్ల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బ్యాంగి బాలకిషన్ డిమాండ్ చేశారు. జడ్చర్ల పట్టణంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో బుధవారం నిర్వహించిన పార్టీ మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముంపునకు గురైన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని, మార్కెట్ వాస్తవ ధర కంటే రెండింతలు అధికంగా ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు. ముంపు గ్రామాల నిర్వాసితులకు పునరావాసం కల్పించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. జిల్లాలోని పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత, కనీస వేతన చట్టాలు అమలు చేయాలన్నారు. అనంతరం సీపీఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా బాగి కృష్ణయ్య, సహాయ కార్యదర్శిగా ఎండీ కలీం, సభ్యులుగా రాజు, సూరి, ఆంజనేయులు, శ్రీశైలం, రహమతుల్లా, చిన్నజంగయ్య, వెంకటయ్య, నాగరాజు ఎన్నికయ్యారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆల్వాల్‌రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు రాజు పాల్గొన్నారు.